






అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ వేడుకకు హాజరైన ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ - సభలో చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి - మంత్రులతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు - సభాస్థలి వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, విజయశ్రీ ,సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, పులివర్తి నాని, కురుగొండ్ల రామకృష్ణ, మురళీమోహన్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం తదితరులు

ఉగ్రవాదులు ఆలయంలోకి వస్తే..

● తిరుపతి కపిలతీర్థంలో భద్రతా దళాల మాక్ డ్రిల్



ఆలయంలో ఉగ్రవాదిని హతమార్చి..




విచ్చిన ద్వారా లోపలకు వచ్చిన భద్రతా దళాలు - అటవీమార్గం గుండా ఆలయం వైపు వస్తూ..

ప్రముఖ ఆలయాల్లోకి ఉగ్రవాదులు ప్రవేశిస్తే.. భక్తులను అడ్డం పెట్టుకుని విధ్వంసానికి ప్రణాళిక రచిస్తే.. వారిని ఎలా ఎదుర్కోవాలి? భక్తులను ఎలా కాపాడాలి? ఈ దిశగా తిరుపతి నగరం కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆక్టోపస్ దళాలు శుక్రవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.రాజారెడ్డి, డీఎస్పీ మధుసూదనరావు నేతృత్వంలో దాదాపు మూడు గంటలపాటు ఈ మాక్ డ్రిల్ జరిగింది. జిల్లా అటవీశాఖ కార్యాలయ ప్రాంగణం నుంచి ఆక్టోపస్ బలగాలు మూడు గ్రూపులుగా విడిపోయి వ్యూహాత్మకంగా ఆలయంలోకి ప్రవేశించారు. చెట్ల చాటుగా ఆలయంలోకి వెళ్లిన భద్రతా దళాలు ఉగ్రవాదులను హతమార్చాయి. మరోవైపు ఆలయమంతటా జల్లెడ పడుతూ భక్తులను రక్షించేలా మాక్‌డ్రిల్ జరిగింది. ఎక్కడైనా బాంబులు పెట్టారా? పెడితే నిర్వీర్యం చేసేలా బాంబు స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఉగ్రవాదులు ఆలయాల్లోకి చొరబడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా డెమోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ సీఐలు, 40 మంది కమాండోలు, 10 మంది టీటీడీ విజిలెన్సు సిబ్బంది, పోలీసులు, రిజర్వు బలగాలు, మెడికల్ సిబ్బంది, ఎలక్ట్రికల్, వాటర్‌గ్యాస్, బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.


- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



ఫెన్సింగ్ దాటుకుంటూ..



భక్తులను కాపాడుతూ, ఉగ్రవాదులకు గురిపెట్టి



ఆలయం లోపల అప్రమత్తంగా..

● బ్యాక్ టూ బర్డ్

బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్



● సీఎం సూచనలతో టీటీడీ ఉత్తర్వులు

తిరుపతి, మే2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ గుడారు జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు గత నెల 2న అమరావతిలో టీటీడీపై సమీక్షించిన సందర్భంలో డాక్టర్ జగదీష్‌ను బర్డ్ డైరెక్టర్‌గా నియమించాలని సూచించారు. ఆమేరకు ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలిలో నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఏడాదిపాటు కాంట్రాక్ట్ పద్ధతిన డైరెక్టర్‌గా నియమిస్తూ నెలకు రూ.2లక్షల వేతనం, వాహనం, ఇతర సౌకర్యాలను కల్పిస్తూ ఈవో ఉత్తర్వులు ఇచ్చారు.

అవమానించిన చోటే.. : 1992లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బర్డ్‌లో చేరిన డాక్టర్ జగదీష్ ఏడాదికే ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయి డైరెక్టర్ అయ్యారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్ కొనసాగారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను డైరెక్టర్ బాధ్యతలనుంచి తప్పించారు. విచారణ అంటూ హడావుడి చేసి అవమానించారు. అప్పటినుంచి ద్వారక తిరుమలలోని 'విర్డ్' ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టర్‌గా కొంతకాలం పనిచేస్తూనే బర్డ్‌కు అలవాటైన రోగులకోసం ప్రతి వారం రాస్ బిల్డింగ్‌లో ఉచిత ఓపీలు చూసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి బర్డ్ డైరెక్టర్‌గా నియమితులవ్వడం గమనార్హం.

ఒకప్పటి బర్డ్‌లా లేదు... : బర్డ్.. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆర్థోపెడిక్ ఆస్పత్రి. మూడన్నర దశాబ్దాలుగా లక్షలాది మంది జీవితాలలో వెలుగులు నింపిన దవాఖానా. గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలు, సంస్థలను నాశనం చేసినట్టే తిరుపతిలోని బర్డ్‌నూ భ్రష్టు పట్టించింది. బర్డ్ ఆస్పత్రి 350 పడకల సామర్థ్యంతో, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 700కు పైగా అవుట్ పేషంట్లు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులు ఉన్నాయి. అత్యవసర వైద్యంలో భాగంగా 6 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో రోజుకు 20 వరకు శస్త్ర చికిత్సలు జరిగే సౌలభ్యం ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ల సంఖ్య దారుణంగా పడిపోయింది. ఒకప్పుడు బర్డ్‌లో ఓపీ తీసుకోవాలంటే ఉదయం 5 గంటలకే చేరుకోవాలి. వారంతో పనిలేకుండా ఆ స్థాయిలో రద్దీ ఉండేది. మధ్యలో ఏదైనా సెలవు వస్తే తర్వాత రోజు రెట్టింపు రోగులు వచ్చేవారు. గడిచిన ఐదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. టీటీడీ నిధులతో నిర్వహించే ఆస్పత్రిని కమర్షియల్‌గా మార్చడంతో సహజంగా పేదరోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది.

బర్డ్‌కు పూర్వ వైభవం తెస్తా: జగదీష్

బర్డ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని నూతనంగా నియమితులైన డైరెక్టర్ జగదీష్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. 30 ఏళ్ల పాటు పనిచేసిన అనుభవంతో బర్డ్‌ను ఏవిధంగా గాడిలో పెట్టాలో తగిన ప్రణాళికలు ఉన్నాయన్నారు. బర్డ్‌కున్న జాతీయ స్థాయి గుర్తింపు దృష్ట్యా వైద్యసేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు నాయుడికి, కూటమి పెద్దలకు, టీటీడీ పాలకమండలికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్స్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షలు శనివారం నుంచి 9వ తేదీ వరకు జరగున్నాయి. ఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో నరసింహులు అధికారులు, ఇన్విజిలేటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 911మందికి తిరుపతి నగరం న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల, యశోద నగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, ప్రకాశం భవన్‌లోని ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాలను కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సీసీకెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ(మానిటర్) వెంకటలక్ష్మి, సెక్షన్ ఆఫీసర్లు సునీత, శివన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశిపెంట్ల వద్ద కారు బోల్తా

● తాతా మనవళ్ల దుర్మరణం, మరో ముగ్గురికి గాయాలు



కాశిపెంట్ల వద్ద బోల్తాపడిన కారు




మృతి చెందిన నూతన్, కరేగౌడ్

చంద్రగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కాశిపెంట్ల వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తాతా మనవడు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు సమీపంలోని లగేరి గ్రామానికి చెందిన మంజునాథ్, భార్య సౌమ్య, కుమారుడు నూతన్(6), అత్తమామలు దొడ్డమ్మ, కరేగౌడ(64), శుక్రవారం తెల్లవారు జామున శ్రీవారి దర్శనానికి కారులో బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో కాశిపెంట్లకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కరేగౌడ్, నూతన్‌కు తీవ్రంగాను.. మంజునాథ్, సౌమ్య, దొడ్డమ్మకూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే కరేగౌడ్, నూతన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవింగ్ చేస్తున్న మంజునాథ్ తన ముందు వెళుతున్న కారును అధిగమించబోయి ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు.




గాయపడిన సౌమ్య, దొడ్డమ్మ

పిడుగుపాటుకు రైతు మృతి



ఎర్రావారిపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యాన్ని కళ్లంబండ మీద ఆర పెడుతున్న రైతు.. పిడుగుపాటుకు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన కోటకొండ భారతి, రమణ దంపతులు రెండు రోజుల కిందట వరి కోత కోశారు. ఊరికి దగ్గరలోని కళ్లం బండ మీద ధాన్యాన్ని శుక్రవారం ఆర బెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వర్షం వస్తుండడంతో ధాన్యాన్ని కుప్పతోసి టార్పాలిన్ పట్ట కప్పారు. ఈదురు గాలికి పట్ట పైకి లేవకుండా రాయి తీసుకొచ్చి పెట్టేందుకు అక్కడ్నుంచి 50 అడుగుల దూరం వెళ్లారు. అదే సమయంలో.. అక్కడ పిడుగు పడటంతో రమణ కుప్పకూలారు. దగ్గరలో ఉన్న ఆయన భార్య భారతి షాక్‌కు గురై స్పృహ తప్పారు. అక్కడే కళ్లంలో పొరుగు రైతు రమణ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే విగతజీవిగా పడిపోయి ఉన్నారు. భారతిని ఇంటికి చేర్చిన స్థానికులు, రమణ మృతి విషయాన్ని బంధువులకు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

తాతయ్యగుంట గంగజాతరకు 15 మందితో కమిటీ

తిరుపతి(కలెక్టరేట్), మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని 15మందితో కలెక్టర్ వెంకటేశ్వర్ కమిటీ ఏర్పాటు చేశారు. రాయలసీమలోనే తిరపతి జాతర ప్రసిద్ధి చెందింది. గంగమ్మ గుడికి పాలకవర్గం ఏర్పాటు కాలేదు. ఈ క్రమంలో జాతర ఏర్పాట్లు, భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు కమిటీని నియమించారు. ఇందులో తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, సామంచి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మబ్బు దేవనారాయణరెడ్డి, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ పులుగోరు మురళి, తాతయ్యగుంట ఆలయ మాజీ ఛైర్మన్ చింతా భరణీయాదవ్, టీడీపీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్ సభ్యులుగా ఉంటారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.11.30 కోట్లు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి రూ.11.30 కోట్ల నాబార్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని 39.4 కిలోమీటర్ల నిడివితో 12 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

● గూడూరు-జయంపు రోడ్డు, కొర్నగుంట-నెర్నూరు రోడ్డు, చెన్నూరు-పాలిచెర్ల రాజుపాలెం రోడ్డు, ఉడతవారిపాలెం-ఆర్‌ఎల్‌ఎస్ రోడ్లకు (13.8 కిలోమీటర్లు) రూ.3.50 కోట్లు కేటాయించారు.

● సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ పరిధిలో పాత మద్రాసు-కలకత్తా రోడ్డు (103-105 కిలోమీటర్ల నడుమ), సూళ్ళూరుపేటలో పాత మద్రాసు-కలకత్తా రోడ్డు (77-79 కిలోమీటర్ల నడుమ), కొండూరు నుంచీ మాంబట్టు మీదుగా కాదలూరు రోడ్డు (6.8 కిలోమీటర్ల నిడివి) అభివృద్ధికి రూ.2.50 కోట్లు కేటాయించారు.

● సత్యవేడు నియోజకవర్గంలో వీఆర్ కండ్రిగ-టీపీ పాలెం రోడ్డు, కావర్‌పేట-సత్యవేడు రోడ్డు (7.8 కిలోమీటర్లు)కు రూ.2 కోట్లు కేటాయించారు.

● చంద్రగిరి నియోజకవర్గంలో పాకాల-కొత్తకోట రోడ్డు, ఎన్‌హెచ్-205 నుంచి వంకమద్దివారిపల్లి, టి.చట్టీవారిపల్లి, చట్టివారిపల్లిల మీదుగా భాకరాపేట-ఎర్రావారిపాలెం రోడ్డును కలిపేందుకు (మొత్తం 11 కిలోమీటర్ల నిడివి) రూ.3.30 కోట్లు కేటాయించారు.

రేపటినుంచి ముక్కంటికి ధారా పాత్ర ఏర్పాటు

శ్రీకాళహస్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆదివారం నుంచి 28వ తేదీ వరకు ధారాపాత్ర ఏర్పాటు చేయనున్నట్లు ఈవో బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ శుద్ధ సప్తమి ఆదివారం డొల్లు కత్తెర ప్రారంభం అవుతన్న నేపథ్యంలో రెండవ కాల అభిషేకం అనంతరం స్వామివారి మూలవిరాట్ పైభాగాన ధారాపాత్ర ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఏటా మండు వేసవిలో వచ్చే డొల్లకర్తరీ, నిజకర్తరీ సందర్భంగా స్వామివారిపై నిత్యం పచ్చకర్పూర జలం ధారగా పడేలా ఈ పాత్ర ఏర్పాటు చేస్తారని తెలిపారు.

కాలువ భూమిలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగించిన రెవెన్యూ అధికారులు

తిరుపతి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె సర్వే నంబరు 195/1లోని కాలువ పోరంబోకు స్థలాన్ని కలిపేసుకుని వైసీపీ నేత ఏర్పాటు చేసిన దారిని శుక్రవారం రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. కాలువ గట్టుపై గ్రావెల్ పరచి ఏర్పాటు చేసిన దారిని చదును చేశారు. ఆర్ఐ రఘువర్మ, వీఆర్వో మురళి, వీఆర్ఏ పాల్గొన్నారు.

ఆలయంలో మంటలు


కాలిపోయిన దేవుడి చిత్రపటాలు

చంద్రగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లయ్యపల్లె హరిజనవాడ శ్రీకృష్ణ ఆలయ గర్భగుడిలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు గమనించి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆలయంలోని దేవుడి చిత్రపటాలు కాలిపోయాయి. చంద్రగిరి పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. దీపం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తుండగా ఇది గుర్తు తెలియని వ్యక్తుల పని అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

ఉపాధి పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

తిరుపతి రూరల్, మే2(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో తప్పనిసరిగా మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. తిరుపతిరూరల్ మండలం రామానుజపల్లె పంచాయతీలో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఏపీవో జ్యోతిశ్రీతో కలసి పరిశీలించారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. పశువుల నీటితొట్టి, ఫాంపాండ్‌ను పరిశీలించారు. కూలీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న చోట కూలీలకు నీడ(షేడ్), నీరు, ప్రాథమిక వైద్యసేవల కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

తిరుచ్చిపై పద్మావతి దేవి అభయం



తిరుచానూరు, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు అర్చకులు అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం, లక్ష్మీపూజ కన్నులపండువగా చేశారు. మధ్యాహ్నం తిరుమంజనం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో జాతర చాటింపు


గంగమ్మకు పాలపొంగలి నైవేద్యం

తిరుపతిరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట నడివీధి గంగమ్మ జాతరను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి చాటింపు వేశారు. ఇందులో భాగంగా వేదపాఠశాలకు సమీపంలోని గంగమ్మతల్లికి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పాల పొంగలి నైవేద్యంగా సమర్పించి.. కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, కుమారుడు మోహిత్‌రెడ్డి గ్రామస్తులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు.

లతా సుబ్రహ్మణ్యంకు సుధారెడ్డి పరామర్శ



రామచంద్రాపురం, మే 2(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నేత, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లతా సుబ్రహ్మణ్యంను టీడీపీ నేత పులివర్తి సుధారెడ్డి శుక్రవారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కిశోర బాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గిడయ్య

భాకరాపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీడీవో గిడయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లులో కిశోర బాలికల వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉన్న బాలికల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, లైంగిక వేధింపుల నుంచి రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, హెచ్‌ఈ వసంత, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వద్ద జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

తిరుచానూరు, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జస్టిస్ ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆగమోక్తంగా శుక్రవారం ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వ రాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వ హించారు. అలం కార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మ వారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు.

నీటి తొట్టెల ఏర్పాటు


మంగళం-శెట్టిపల్లి మార్గంలో నిర్మించిన నీటితొట్టె

తిరుపతి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళంలో మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు మూడు నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. పల్లెపండుగ పేరిట ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంగళం-శెట్టిపల్లి రహదారి, మిట్టగాంధీపురం, న్యూమంగళంలో నిర్మించారు. ప్రత్యేక కొళాయి ద్వారా తొట్టెల్లోకి నీరు నింపే ఏర్పాటు చేశారు. మూగజీవుల దాహార్తి తీరుతున్నందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఐతో పిల్లల మెదడు అభివృద్ధి చేయొచ్చు


స్క్రీనింగ్ స్కోర్ కార్డులను చూపుతున్న అధికారులు

చంద్రగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లె క్లస్టర్ పరిధిలో ప్రభుత్వ భాగస్వామ్యంతో కేర్ ఎన్‌గ్రో సంస్థ ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో అంగన్‌వాడీ పిల్లలకు మెదడు అభివృద్ధి పరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం నారావారిపల్లెలోని స్కిల్ అండ్ డెవల్ ఎమెంట్ భవనంలో క్లస్టర్ పరిధిలోని ఏడు గ్రామాల్లో 8 అంగన్‌వాడీ కేంద్రాలలో 318 మంది పిల్లలకు ఏఐ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన అభివృద్ధి ఆలస్యాల ఆధారంగా పిల్లలకు వ్యక్తిగత మెదడు అభివృద్ధి స్కోర్ కార్డులు అందజేసారు. అనంతరం పిల్లల తండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పిల్లల అభివృద్ధిని ఎలా పరిగణించాలో, ఇంట్లో ఏవిధంగా రోజూ చిన్నచిన్న యాక్టివిటీలను చేయించాలో వివరించారు. ఏఐ ఆధారిత స్కోర్ కార్డు ఆధారంగా తల్లితండ్రులకు రోజూ ఆటలు, వీడియోలు, వాయిస్ మెసేజ్‌లు పంపుతారని, అభివృద్ధి ఆటలతో పిల్లల బుద్ధి, భాష, సామాజిక నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం మెరుగవుతాయని ఐసీడీఎస్ పీడీ వసంత తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ప్రదీప, సర్పంచ్ బొబ్బా లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, కేర్‌ఎన్‌గ్రో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ భానుప్రసాద్, ఆపరేషన్ మేనేజర్ రఘురామ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుకు వెన్నుదన్నుగా ఫామ్‌పాండ్స్

● ఉపాధి కూలీలతో ఉచితంగా ఏర్పాటు



దుర్గసముద్రంలో నిర్మించిన ఫామ్‌పాండ్స్, రామానుజపల్లెలో నిర్మిస్తున్న ఫామ్‌పాండ్‌ను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

తిరుపతి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు తక్కువగా ఉన్న గ్రామ పంచాయతీలను గుర్తించి భూమిలో నీటి శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫామ్‌పాండ్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వర్షాలు పడినప్పుడు వీటిలోకి నీరుచేరి నిల్వ ఉంటుంది. తద్వారా భూమిలో నీటిశాతం పెరిగి పంటలు సాగుచేసే రైతులకు ఎంతో వెన్నుదన్నుగా ఉంటాయి. ప్రత్యేకించి వేసవిలో సాగునీటి కొరతను అధిగమించేందుకు కొంతవరకు ఉపయోగపడతాయి. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల పొలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో ఉచితంగా వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామాల్లో పనులు లేక వలస వెళ్లే కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు సాగుపరంగా భూమిలో నీటిశాతం పెరిగి అంతిమంగా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. అయితే తిరుపతి రూరల్ మండలంలోని పంచాయతీల్లో వీటి నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. నెలకు 50చొప్పున మూడునెలలకు 150 ఫామ్‌పాండ్స్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ 19 ఫామ్‌పాండ్స్‌ని మాత్రమే నిర్మించారు. మరో 36 నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక్కో ఫామ్‌పాండ్‌ని రూ.62వేల అంచనాతో 8మీటర్ల పొడవు, వెడల్పులతో పాటు 2మీటర్ల లోతుతో ఏర్పాటు చేస్తున్నారు. కాగా రూరల్‌లోని పలు గ్రామపంచాయతీలు నగరానికి అత్యంత చేరువగా నివాసాలకు అనువుగా ఉండే విలువైన భూములు కావడంతో రైతులు తమ భూముల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపని పరిస్థితి ఉందని తెలిసింది. దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించినా ఏర్పాటుకు ముందుకురాని పరిస్థితి. నగరానికి కొంతదూరంగా ఉన్న కొన్ని పంచాయతీల్లో మాత్రం వీటిని ఏర్పాటు చేసుకునేందుకు రైతులు కొంతవరకు ఆసక్తి చూపుతున్నారని తెలిసింది. దీనిపై ఏపీవో జ్యోతిశ్రీని వివరణ కోరగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగా ప్రోత్సహిస్తామని చెప్పారు. చెరువుల్లో నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధి కూలీలతో పర్కులేషన్ పాండ్స్‌ని కూడా తవ్విస్తున్నామని వివరించారు.

వివాహిత ఆత్మహత్య


స్వాతి మృతదేహం

వెదురుకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం కేశవకుప్పం గ్రామ పంచాయతీ పసలవానిమిట్టకు చెందిన జ్యోతిప్రకాష్, బెంగళూరుకు చెందిన స్వాతి అలియాస్ శిల్ప(21) ప్రేమించుకున్నారు. వీరి ప్రేమించుకున్నా- పెద్దల సమక్షంలోనే సంప్రదాయబద్ధంగా రెండేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక మగ బిడ్డ కూడా పుట్టాడు. ఆ బిడ్డకు త్వరలోనే పుట్టెంట్రుకలు తీసే కార్యక్రమం కూడా ఉంది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ.. పసలవానిమిట్టలోని ఇంట్లో స్వాతి శుక్రవారం ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కార్వేటినగరం పోలీసులు రాత్రి తొమ్మిది గంటల వరకు కేసు నమోదు చేయలేదు.

పంటలపై ఏనుగుల దాడి



బంగారుపాళ్యం, మే 2 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలి సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో గురువారం రాత్రి ఏనుగులు పంటలపై దాడి చేశాయి. మొగిలి రైతు శ్రీరాములరెడ్డికి చెందిన మామిడి చెట్లను విరిచేసి, కంచెను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన మొగిలప్పకు చెందిన వరి పంటను సైతం తొక్కేశాయి. చేతికందే సమయంలో పంటలను ఏనుగులు నాశనం చేస్తున్నాయని రైతులు వాపోయారు. ఇప్పటికైనా సోలార్ కంచె ఏర్పాటు చేసి, ఏనుగుల దాడులను నివారించాలని కోరుతున్నారు.

మాజీ ఎంపీటీసీ ఇంట్లోకి దొంగలు..!

● రూ.3 లక్షల విలువైన ఆభరణాలు, రూ.80 వేల నగదు చోరీ



మంజులమ్మ ఇంట్లో తెరిచిన బీరువా,
దొంగలు ప్రవేశించిన కిటికీని పరిశీలిస్తున్న కానిస్టేబుల్

పలమనేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.3 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.80 వేలు నగదు చోరీ చేసుకెళ్లిన సంఘటన గురువారం అర్ధరాత్రి పలమనేరు మండలంలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. మండలంలోని కొలమాసనపల్లి గ్రామంలో పలమనేరు-కుప్పం రహదారి పక్కనే నివాసముంటున్న మాజీ ఎంపీటీసీ మంజులమ్మ గురువారం శాంతిపురం మండలంలోని తన సోదరి కుమారుడి పెళ్లికి వెళ్లింది. ఈ సమయంలో మంజులమ్మ ఇంటి వెనుక వైపున ఉన్న కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటిలోని మూడు గదుల్లో ఉన్న నాలుగు బీరువాలను పగులగొట్టి తెరిచారు. అందులోని రూ. 80 వేలు నగదుతో పాటు సుమారు రూ.3 లక్షలు విలువైన 20 గ్రాములకుపైగా బంగారు ఆభరణాలు, 500 గ్రాములకు పైగా వెండి ఆభరణాలు, దేవుడి విగ్రహాలు చోరీ చేసుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగొచ్చిన మంజులమ్మ తన ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్న ఆటో

● తీవ్రంగా గాయపడ్డ తండ్రీకొడుకులు
● తండ్రి పరిస్థితి విషమం



రోడ్డుపై నుంచి ఆటోను తొలగిస్తున్న పోలీసులు

గుడిపాల, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నుంచి వేలూరు వైపు వస్తున్న ఆటో గుడిపాల మండలంలోని అనుపు వద్దకొచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి.. అదుపుతప్పి దాని వెనుకనే ఉన్న ఎక్స్‌కవేటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసమవగా, అందులో ప్రయాణిస్తున్న నగరికి చెందిన తండ్రీకొడుకులు రుష్యేంద్రకుమార్, భువన చంద్ర తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 190రామాపురం సీఎంసీలో చేర్పించారు. తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన భువన చంద్ర, రుష్యేంద్రకుమార్

సింహ వాహనంపై అగస్త్యేశ్వరుడి విహారం



నారాయణవనం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వ స్వామి ఆలయ వార్షిక బ్ర హ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్లను సింహవాహనంపై ఊరేగించా రు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్య పూజా కైంకర్యాలు నిర్వహిం చారు. అనంతరం ఉత్స వమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతరప్రాకరంలో ఊరేగిం చారు. సాయం త్రం విశేష పూజలనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామిఅమ్మవార్లను సింహ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై పునర్విచారణ



వివరాలు సేకరిస్తున్న డీఎల్పీవో

వరదయ్యపాళెం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో జరిగిన అవకతవకలు, నిధుల గోల్‌మాల్‌పై శుక్రవారం తిరుపతి డీఎల్పీవో సురేష్‌నాయుడు పునర్వి చారణ చేపట్టారు. ఇందిరానగర్ పంచాయతీలో 2016-23 మధ్య జరిగిన నిధుల అవకత వకలపై సామాజిక కార్యకర్త ఆశ సమాచార హక్కు చట్టం ద్వారా రూ.70లక్షలు గోల్‌మాల్ జరిగిందని, ఆధారాలు సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ కమి టీలు పలుమార్లు తనిఖీ చేసి రూ.21లక్షలు అవకతవకలు జరిగాయంటూ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుత సర్పంచ్ సల్లా వీరభద్రం చెక్ పవర్‌ను రద్దు చేయడమేకాకుండా, నాటి పంచాయతీ అధికా రులను సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే దీనిపై మరోమారు ఆశా విచా రణ పారదర్శకంగా జరగలేదని రూ.70లక్షలకు గాను రూ.21లక్షలు మాత్ర మే అవకతవకలు జరిగినట్లు తేల్చ డంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కలె క్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్ర వారం డీఎల్పీవో స్థానిక సచివాల యంలో గ్రామసభ చేపట్టి విచారణ చేశారు. స్థానిక సచివాలయంలో ఆరోప ణలు ఎదుర్కొంటున్న మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, ఫిర్యాదుదారు సమక్షంలో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ... తాము ఫిర్యాదు చేసిన అంశాలలో సమగ్రంగా సక్రమంగా విచారణ జరగలేదన్నారు. ఒకే వరస సంఖ్యలో వివిధ దఫాలుగా బిల్లులు సృష్టించి నిధులు స్వాహా చేశారని, సంతకాలు ఫోర్జరీ చేశారని చెప్పారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శు లపై డీఎల్పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిం చి వారి ఆదేశాల మేరకు తదుపతి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేసవిలోనూ మొరవపోతోంది


మొరవపోతున్న చెన్నాయిగుంట చెరువు

తిరుపతి అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా చెరువులు వర్షాకాలంలో మొరవపోతుంటాయి. అయితే మంగళంలోని చెన్నాయిగుంట చెరువు వేసవిలోనూ మొరవపారుతూ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చెరువు పూర్తిస్థాయి నీటిసామర్థ్యంతో కళకళలాడుతోంది. అయితే దీనికి ప్రధాన కారణం చెరువుకు ఎగువన కొంతదూరంలో తెలుగుగంగ పైపు లీకేజీతో 50హెచ్‌పీ సామర్థ్యం గల నీరు వచ్చి చేరుతోంది. అంతేగాక తిరుపతి నుంచి కొంత, మంగళం ప్రాంతంలోని మురుగునీరు కాలువల ద్వారా వచ్చి చేరుతున్నాయి. అందుకే చెరువు నిండి మొరవపోతోంది. కాగా చుట్టుపక్కలున్న శెట్టిపల్లి, మంగళం, అన్నాచెరువులు సగం వరకు నీటిమట్టం తగ్గుముఖం పట్టాయి.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

తిరుపతి(వైద్యం), మే 2(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని ఎంఎల్‌హెచ్‌పీలు స్పష్టం చేశారు. రెగ్యులర్ చేయాలని, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు ఎంఎల్‌హెచ్‌పీలు నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విదితమే. నాలుగో రోజైన శుక్రవారం ప్లకార్డులు చేతపట్టి మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. రెగ్యులర్ చేయడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు.

వినాయకుడి విగ్రహాల తయారీ షురూ



వినాయకుడి విగ్రహ పీటలను తయారు చేసిన దృశ్యం

తిరుపతి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీ బొమ్మల క్వార్టర్స్‌లో వినాయకుడి విగ్రహాల తయారీ మొదలైంది. విగ్రహాల తయారీకి అవసరమైన మూడు అడుగుల వెడల్పు, ఐదు అడుగుల పొడవుతో కలప పీటలను సిద్ధం చేస్తున్నారు. అందులో తేమను పోగొట్టడానికి ఎండలో వరుస క్రమంలో అమర్చిపెట్టారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ



ఊరేగుతున్న సేనాధిపతి

తిరుపతి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి ఆలయంలో శనివారం జరగనున్న పుష్పయాగానికి శుక్రవారం రాత్రి అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో తెలిసీ తెలియక జరిగిన దోషాల ప్రాయశ్చితంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. శనివారం మధ్యాహ్నం లక్ష్మణసీతాసమేత కోదండరామస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4-6గంటల మధ్య తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి, సంపంగి, రోజా, కలువలు పుష్పాలతో ఉత్సవర్లకు అభిషేకం చేయనున్నారు. రాత్రి 7 గంటలకు మాడవీధుల్లో ఊరేగిస్తారు.

15 నిమిషాల్లో మహిళను కాపాడారు

- తిరుపతి శక్తి టీమ్‌కు ఎస్పీ అభినందన



మహిళ ప్రాణాలు కాపాడి వారి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు వెళ్ళి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించిన ఒక మహిళను 15 నిమిషాల వ్యవధిలో తిరుపతి శక్తి టీమ్ పోలీసులు కాపాడిన ఘటన శుక్రవారం జరిగింది. దీనికి సంబంధించి శక్తి టీమ్ ఏఎస్‌ఐ గిరిజ కథనం మేరకు.. హైదరాబాదుకు చెందిన లక్ష్మి నెలరోజుల క్రితం తిరుచానూరుకు చెందిన హేమంత్‌కుమార్‌ను వివాహం చేసుకుంది. అప్పటి నుంచి మహేష్ ఆమెను చిత్ర హింసలకు గురిచేస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి చనిపోవాలని భావించింది. ఈ నేపథ్యంలో తిరుమలకు వెళుతున్నానని పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. యుద్ధప్రాతిపదికన స్పందించిన కమాండ్ కంట్రోలు సిబ్బంది శక్తి టీమ్‌ను అప్రమత్తం చేశారు. అలిపిరి నుంచి ఆమె ఉన్న లోకేషన్ వస్తున్నదని వెంటనే అలిపిరి వద్దకు వెళ్ళాలని చెప్పారు. దీంతో అలిపిరి వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న లక్ష్మికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆమె భర్త హేమంత్‌కుమార్‌ను తీవ్రంగా మందలించారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. శక్తి టీమ్ ఏఎస్‌ఐ గిరిజ, మహిళా హెడ్ కానిస్టేబుల్ శాంతి, మహిళా పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గరుడ వారధిపై పుట్టినరోజు వేడుకలు!

- సీసీ కెమెరాల్లో గుర్తించి పోలీసులు రావడంతో పరారీ

తిరుపతి(నేరవిభాగం), మే 2 (ఆంధ్రజ్యోతి): 'గరుడ వారధిపై పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవద్దు. కేకులు కట్ చేస్తే చర్యలు తీసుకుంటాం. వాహనాలను ఎక్కడా నిలపొద్దు. అతివేగంగా వెళ్లొద్దు'.. ఇలా పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా కొందరు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. అలాంటి వారికి సోలార్ సీసీ కెమెరాల ద్వారా చెక్ పడింది. అదెలాగంటే.. గురువారం అర్ధరాత్రి స్నేహితులైన కొందరు యువకులు, యువతులు కలిసి గరుడ వారధిపై బర్త్‌డే వేడుకలు చేసుకోవడానికి వచ్చారు. సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోలు సిబ్బంది గమనించి వెంటనే ఎస్పీ హర్షవర్ధనరాజు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన అక్కడకు పోలీసులను పంపారు. గరుడ వారధిపై బర్త్‌డే వేడుకలు జరుపుకుంటున్న వారిని పోలీసులు తరిమి కొట్టారు. గరుడ వారధిపై ఆపి ఉన్న ఆటో డ్రైవర్‌కు హెచ్చరికలు జారీ చేశారు. గరుడ వారధిపై పుట్టిన రోజు వేడుకలు, పార్టీలు చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. 'గరుడ వారధిపై పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవద్దు. దీని వల్ల వేగంగా వస్తున్న వాహనాలను గమనించకుండా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. వారధిపైన వాహనాలకు పార్కింగ్ లేదు. గరుడ వారధిని శ్రీవారి నిలయంగా చూడాలి. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే సీసీ కెమెరాలు పట్టిస్తాయనేది గుర్తించాలి' అని ఎస్పీ హర్షవర్ధనరాజు సూచించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



భాకరాపేట, మే 2(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల గ్రామ పంచాయతీ తుమ్మచేనుపల్లెకు చెందిన సింగం చంద్రారెడ్డి ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది. శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్ద మేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అప్పుడు పిడుగు పడి ఆవు మృతి చెందింది. ఆవు రోజుకు 20 లీటర్ల పాలు ఇచ్చేదని, సుమారు రూ.లక్ష విలువ జేస్తుందని రైతు తెలిపారు. కుటుంబానికి జీవనాధారమైన ఆవు మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రేపు స్థానికుల దర్శన కోటా టోకెన్ల జారీ

తిరుమల, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు కల్పించే దర్శనంలో భాగంగా టీటీడీ ఆదివారం టోకెన్లను జారీ చేయనుంది. మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమల స్థానికులకు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన ఉదయం 5 గంటల నుంచి టోకెన్లు జారీ చేస్తారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన భక్తులు ఆధార్ కార్డు చూపి టోకెన్లు పొందవచ్చు.

బీసీల సంక్షేమానికి కృషి



రామచంద్రయ్యను సన్మానిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), మే 2 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని టీటీడీ విశ్రాంత ఉద్యోగి రామచంద్రయ్య అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ టీటీడీలో బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేశామన్నారు. అలాగే సమాజంలో బీసీ కులాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య, బి.లక్ష్మయ్య యాదవ్, అశోక్ సామ్రాట్ యాదవ్, బీవీ కేశవులు, పుష్పావతి, విజయ లక్ష్మి, విడగొట్టే రమణ పాల్గొని రామచంద్రయ్య యాదవ్‌ను సన్మానించారు.

అమరావతి సభకు ఉమ్మడి జిల్లా నేతలు

తిరుపతి, మే2(ఆంధ్రజ్యోతి) : అమరావతి పునరుద్ధరణ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద యెత్తున వెళ్లారు. ప్రధాన సభ ముందు తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, సునీల్ కుమార్, రామకృష్ణ, పులివర్తి నాని, నెలవల విజయశ్రీ, మురళి, ఎమ్మెల్సీ శ్రీకాంత్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ మంత్రి పరసారత్నం తదితరులు సందడి చేశారు.

ఘనంగా శంకర జయంతి శోభాయాత్ర



తిరుపతి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక శృంగేరి శంకరమఠంలో శంకరజయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోదండరామస్వామి ఆలయ మాడవీధుల్లో పల్లకిసేవతో శోభాయాత్ర కావించారు. భక్తులు పెద్దఎత్తున ఆదిశంకరాచార్యుల చిత్రపటాలను ఊరేగించారు. జయ జయ శంకర నినాదాలతో మాడవీధులు హోరెత్తాయి. మఠం ధర్మాధికారి రాళ్లపల్లి రామమూర్తి, గంగ్రకోట లక్ష్మీమనోహర్, నడింపల్లి కృష్ణ, పూర్ణచంద్ర, సురభి, మురళి పాల్గొన్నారు.

వివాహితను వేధించిన కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): వివాహితను వేధించి, బెదిరించిన కేసులో నిందితుడు చంద్రమౌళిని తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ కుమ్మరపల్లి గ్రామంలో నివాసముంటున్న వివాహితను చంద్రమౌళి గతంలో బెదిరించి, వేధించేవాడు. దీనిపై గురువారం అందిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చిన్నగోవిందు చెప్పారు.

9మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం): మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిని తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

జాతర ఘనంగా నిర్వహిద్దాం

ఏర్పాట్లను పరిశీలించిన మేయర్, కమిషనర్



తిరుపతి, మే 2(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగ జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది, ప్రజలు కలసికట్టుగా కృషిచేయాలని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు జాతర జరగనున్న నేపథ్యంలో గురువారం ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లను నగరపాలక సంస్థ, తుడా, ఆలయ అధికారులతో కలసి మేయర్, కమిషనర్లు పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూజాతరకు ఎంతో ప్రాశస్త్యం ఉందని, వైభవంగా నిర్వహించేందుకు అధికారులందరూ తమవంతు కృషి చేయాలని అన్నారు. గంగమ్మను ప్రముఖులు దర్శించుకుంటారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ జాతర వైశిష్ట్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, సిబ్బంది ఏర్పాట్లు పక్కగా చేసేందుకు సహకరించాలని అన్నారు. ముఖ్యంగా భక్తులకు అవసరమైన తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. మరుగుదొడ్లు, క్యూలైన్లు ఉండేలా చూడాలన్నారు. ఎటువంటి పొరపాట్లకూ తావులేకుండా చూడాలని ఆదేశించారు. ఆలయ ఈవో జయకుమార్, నగరపాలక సంస్థ, తుడా సూపరింటెండెంట్ ఇంజనీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్ వారి వెంట ఉన్నారు.

వేడుకగా శంకరాచార్యుడి జయంతి



బిరుదును ప్రదానం చేస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీలో ఆదిశంకరాచార్యుడి జయంతి కార్యక్రమం శుక్రవారం వేడుకగా సాగింది. యూనివర్సిటీ ప్రాంగణంలోని శంకరాచార్యుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రస్థానత్రయ భాష్య పారాయణం, శంకరుల పూజాభిషేకం నిర్వహించారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ శంకరాచార్యుడి విస్తృతమైన పాదయాత్ర, అనేక రచనల గురించి వివరించారు. అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా మాట్లాడుతూ దేశం నాలుగు చెరగులా శంకరాచార్యుడు పీఠాలు స్థాపించారని గుర్తుచేశారు. అంతకు ముందు శంకరాచార్యుడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ప్రతిభా పోటీల్లో విజేతగా నిలిచిన తేజ్‌కుమార్‌కు 'వాక్యార్థ చక్రవర్తి' బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధికారులు రాధాగోవిందత్రిపాఠి, అద్వైత వేదాంత విభాగాధిపతి గణపతిభట్, సతీష్, నాగరాజభట్, మనోజ్‌షిండే, హరిదాయ్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు పటిష్ట భద్రత కల్పిస్తాం



తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు

తిరుపతి(సెంట్రల్), మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి -తిరుమలకు వస్తున్న ప్రయాణికులకు పటిష్ట భద్రత కల్పిస్తున్నామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) తిరుపతి ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్, ప్రభుత్వ రైల్వే పోలీస్ సీఐ ఆశీర్వాదం తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫారాల్లో అనుమానిత బ్యాగులను తనిఖీ చేశారు. విశ్రాంతి గదులు, దుకాణాలు, క్లాక్ రూమ్‌లను పరిశీలించారు. కశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ఈ తనిఖీలు చేసినట్లు చెప్పారు. రైళ్లలో వరుస దోపిడీలను నివారించడానికి ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్రరాజు, రాంబాబు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు వేసవి శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న సుధారాణి

తిరుపతి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): సప్తగిరి కాలనీ సచివాలయ ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి మంగళం పరిధిలోని కిశోర బాలికలు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీవో జి.సుధారాణి మాట్లాడుతూ లింగవివక్ష, నైపుణ్యం, ఉపాధి, ఆత్మరక్షణ, బాల్య వివాహాలను అరికట్టడం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, వ్యక్తిగత శుభ్రత, నాణ్యమైన విద్య, సంపూర్ణ ఆరోగ్యం, ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు భారతి, జయంతి, సంధ్యారాణి, ప్రొఫెసర్ విష్ణు, మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ అరుణ పాల్గొన్నారు.

ముగిసిన భాష్యకార్ల సాత్తుమొర

తిరుపతి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో పది రోజులు పాటు జరిగిన భాష్యకార్ల ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం 7.30-9గంటల మధ్య స్వామివారు, భగవద్ రామానుజుల ఉత్సవర్లు మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. తిరుమంజనం, ఆస్థానం, సాత్తుమొర ఇత్యాది కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నమాచార్య కళామందిరంలో కేఈ.లక్ష్మీనరసింహన్ ప్రవచిస్తూ భక్తిఉద్యమంతో సమానత్వాన్ని బోధించి సమాజాన్ని సంస్కరించిన మహనీయుడు రామానుజాచార్యులని అభివర్ణించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు లక్ష్మీరాజ్యం బృందం గాత్ర సంగీతం నిర్వహించారు.

మళ్లీ వెనక్కొచ్చిన జంట ఏనుగులు

ఎర్రావారిపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ అడవులకు వెళ్లిన జంట ఏనుగులు ఒక రాత్రి గడవక ముందే తిరిగొచ్చాయి. ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయల పెంట అటవీ సరిహద్దు భూముల్లోకి చేరాయి. ఏనుగులు వస్తాయంటూ ఏటీఎఫ్ (ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్) సిబ్బంది రెండు రోజుల కిందట స్థానిక రైతులను హెచ్చరించారు. దీంతో మామిడి తోపుల వద్ద కాపలా నుంచి రైతులు ఇళ్లకు చేరారు. ఈ క్రమంలో గురువారం రాత్రి మల్లయ్య మామిడి తోటలోకి ఏనుగులు వచ్చి కాయలు తింటుండగా.. ఏటీఎఫ్ సిబ్బంది తరమడంతో వెళ్లాయి. తమ ఏటీఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని ఏటీఎఫ్ ఇన్‌ఛార్జి, భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు.

దుకాణాల తొలగింపునకు యత్నం

- అడ్డుకున్న ఏఐటీయూసీ నేతలు



అధికారులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత రాధాకృష్ణ

తిరుపతి(జీవకోన), మే 2(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని బొంతాలమ్మ ఆలయ ముందు ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను నగరపాలక సంస్థ అధికారులు శుక్రవారం తొలగించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నేత రాధాకృష్ణ అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దుకాణాల నిర్వాహకులు నిల్వ ఉంచే ఆహార పదార్థాల కోసం అటవీ ప్రాంతం నుంచి జింకలు, వాటికోసం చిరుత పులులు వస్తున్నాయని అటవీ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారని, కమిషనర్ ఆదేశాల మేరకు తొలగిస్తున్నామని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడేంత వరకు తొలగించవద్దని విజ్ఞప్తి చేయగా అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఆదర్శ దంపతులు సీతారాములు

వివాహం దివ్యత్వ సాధనం పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి, రఘురాం, మేడసాని మోహన్, దక్షిణామూర్తిశర్మ, పీవీ రెడ్డి, ఆముదాల మురళి, గంగవరం శ్రీదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో ఆదర్శ దంపతులుగా సీతారాములు నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త గంగవరం శ్రీదేవి సంపాదకత్వం వహించిన 'వివాహం దివ్యత్వ సాధనం' పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. సంస్కృత యూనివర్సిటీ - శ్రీరామకృష్ణ సేవా సమాజం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని సంస్కృత వర్సిటీలోని చెలికాని అన్నారావు హాల్లో నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సీతారాముల దాంపత్యాన్ని ఉత్తరామ చరితంలో భవభూతి కొనియాడారని తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రత్యేకాధికారి శ్రీరామ్ రఘురాం మాట్లాడుతూ నేటి సామాజిక పరిస్థితుల్లో దాంపత్య జీవితానికి ఆదర్శ మార్గాన్ని ఈ పుస్తకం నిర్దేశిస్తుందని చెప్పారు. అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మేడసాని మోహన్ మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య పవిత్ర ప్రణయ అనుబంధమే దాంపత్యమని అభిప్రాయపడ్డారు. సంస్కృత వర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, రామకృష్ణ మిషన్ తిరుపతి శాఖ అధ్యక్షులు పీవీ రెడ్డి మాట్లాడుతూ మన దేశంలోని దాంపత్య విధానం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అవధాని ఆముదాల మురళి పుస్తక సమీక్ష చేశారు. పుస్తక సంపాదకులు గంగవరం శ్రీదేవి మాట్లాడుతూ పతనమవుతున్న దాంపత్య జీవిత విలువలను పెంపొందించే లక్ష్యంతో ఈ పుస్తకాన్ని వెలువరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ఛైర్మన్ డాక్టర్ మోహన మునిసిద్ధారెడ్డి, తెలుగు అధ్యాపకులు నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఆధ్యాత్మిక, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సాయి కొర్రపాటి

తిరుమల, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ నిర్మాత సాయి కొర్రపాటి, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

4, 5 తేదీల్లో ఏజీటీయూపీఎస్ఎస్ వార్షికోత్సవం

తిరుపతి(ఆటోనగర్), మే2(ఆంధ్రజ్యోతి): అఖిల గాండ్ల తెలకల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని స్థానిక పూజిత రెసిడెన్సీలో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకులు వి.హరికృష్ణ, కె.రామిశెట్టి తెలిపారు. గాండ్ల తెలకల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం దిశగా చర్చలు చేస్తామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి విరాళం



విరాళమిస్తున్న చంద్రమౌళి చౌదరి

తిరుపతి అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం రేణిగుంట రహదారిలోని ఉప్పరపాళెం అరుంధతివాడ గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి చంద్రమౌళి చౌదరి రూ. 2లక్షలు విరాళంగా అందించారు. గ్రామస్తులు మణి, గోపి, శివనాదముని, మునిరాజ, రాము, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతిరూరల్, మే2(ఆంధ్రజ్యోతి): స్థానిక యూత్ హాస్టల్‌లో శనివారం ఉదయం 10గంటలకు ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఏపీ, తెలంగాణా రాష్ట్రాల ఉపాధ్యక్షుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎల్.రత్న కుమార్ తెలిపారు. సంఘంతో పాటు అనుబంధ సంఘాల నేతలు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర

తిరుమల, మే2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. రామానుజులు జన్మించిన వైశాఖ మాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం భాష్యకార్లను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. తర్వాత నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఒక తిరుచ్చిపై, భాష్యకార్లను మరో తిరుచ్చిపై ఊరేగించారు. అనంతరం ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రాత్రి భాష్యకార్ల సన్నిధిలో సాత్తుమొర నిర్వహించారు. ప్రత్యేక అభరణాలతో సళ్లింపు చేయడంతో కార్యక్రమం ముగిసింది జీయర్‌స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎస్‌డీవోగా బాలాజీ

తిరుపతి(క్రీడలు), మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇన్‌చార్జి డీఎస్‌డీవోగా ఎ.బాలాజీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు కొనసాగిన సయ్యద్‌సాహెబ్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు డీఎస్‌డీవో బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శాప్ ఎండీ గిరీష ఉత్తర్వులు జారీచేశారు.


శ్రీవారి సర్వదర్శనానికి 17 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.04 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 57,863

తలనీలాలు సమర్పించినవారు: 31,030



నియోజకవర్గాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయనున్నట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. దీనికోసం నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, సిబ్బంది సకాలంలో ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలన్నారు. 'నియోజకవర్గాల అభివృద్ధి- స్వర్ణాంధ్ర 2047' సాధనలో భాగంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరీ హాలులో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాలు అభివృద్ధి చెందితే జిల్లా, జిల్లాలు అభివృద్ధి చెందడం ద్వారా రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, సకాలంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అందరూ కృషి చేయాలని ఏపీ సెక్రటేరియట్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాంబాబు సూచించారు. ప్రతి వ్యక్తి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ప్రణాళిక శాఖ సలహాదారు సీతాపతిరావు కోరారు. ప్రతి కుటుంబం ఒక పరిశ్రమలాగా రూపొంది, వృత్తి నైపుణ్యాల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు తోడ్పాటును అందించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యక్తికీ, ప్రతి రంగంలో, ప్రతి పనిలో అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేలతో సంప్రదించి నియోజకవర్గ ప్లాన్‌ను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జిల్లా గణాంకాధికారి ప్రేమచంద్ర, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం ఎర్రచందనం కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. అటవీశాఖ బీట్ అధికారి రాజేష్ తెలిపిన ప్రకారం.. కడప జిల్లా మాధవరానికి చెందిన రమేటి సుబ్బరాజు, వెంకటాపురం గ్రామానికి చెందిన గంపల యల్లయ్య 2019లో సిద్దవటం రేంజ్ పరిధిలోని ముతుకూరు బీట్‌లో రెండు ఎర్రచందనం దుంగలను తరలించడానికి సిద్ధంగా ఉంచారు. అప్పటి బీట్ అధికారి హైమావతి దేవి, రేంజర్ ప్రసాద్ వారిని పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి.. ఒక్కో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో లైజన్ అధికారులుగా రాజేష్, శ్రీనివాస్ వ్యవహరించారు. కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలకృష్ణమనాయుడు వాదనలు వినిపించారు.

'ఎర్ర' స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణి(35)పై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం ఆమోదించింది. తిరువణ్ణామలై జిల్లా జమునమత్తూరు తాలూకా నల్లపట్టు గ్రామానికి చెందిన గోవిందన్ కుమారుడు శివమణి తరచూ ఎర్రావారిపాలెం మండల పరిసరాల్లోని అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికి దుంగలు అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసు, టాస్క్‌ఫోర్స్ రికార్డులు చెబుతున్నాయి. ఇతడిపై పలు కేసులు నమోదు కావడంతో పాటు ప్రస్తుతం అరెస్టయి కడప సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్నాడు. ఎర్రచందనం అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరిస్తుండడం, పలు కేసులతో నేర చరిత్ర కలిగివున్న నేపథ్యంలో అతడిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ కలెక్టర్ మార్చి 22న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై గత నెల 16వ తేదీన అడ్వైజరీ బోర్డు నిందితుడిని, దర్యాప్తు అధికారులను విచారించింది. నిందితుడి నేర చరిత్రను పరిగణనలోకి తీసుకున్న అడ్వైజరీ బోర్డు కలెక్టర్ విధించిన పీడీ యాక్టును సమర్థిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో కలెక్టర్ నిర్ణయాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అజ్ఞాతంలోకి 'ఎర్ర' దొంగలు

● పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరి పూచీకత్తుతో ఐదుగురు నిందితులు జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పూచీకత్తుదారులకు భారీ జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ అధికారి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా పెరియవళ్లి గ్రామానికి చెందిన ఎ.రమేష్, కుమార్, డి.చిన్నస్వామి, సుధాకర్, ఏలుమలై.. చిత్తూరు జిల్లా ఐరాల పరిధిలో ఎర్రచందనం దుంగలు అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదేళ్ల కిందట ఐరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల తర్వాత వీరికి పీలేరుకు చెందిన జి.శేషాద్రి నాయుడు, ప్రసాద్ ష్యూరిటీ ఇచ్చి బెయిల్‌పై విడుదల చేయించారు. బెయిల్‌పై విడుదలైన ఐదుగురిలో ఎ.సుధాకర్ మృతి చెందాడు. మరో నలుగురికి న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేయించిన ఇద్దరికి.. ఒక్కో నిందితుడికి రూ.20 వేల చొప్పున జరిమానా చెల్లించాలంటూ శుక్రవారం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు.

ఆలయం ముందు భక్తులు



తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం సాయంత్రం పెరిగిన భక్తుల రద్దీ.. శుక్రవారమూ కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు కాస్త ఖాళీగానే కనిపించినప్పటికీ శని, ఆదివారాలు వరుస సెలవులు ఉండటంతో శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వీరికి 17 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మూడుగంటల తర్వాత దర్శనం లభిస్తోంది. రద్దీ పెరిగిన క్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, లడ్డూకౌంటర్, అఖిలాండం, అన్నప్రసాద భవనం, సీఆర్వో, లేపాక్షి సర్కిల్, రాంభగీచ వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. శని, ఆదివారాల్లోనూ ఈ రద్దీ కొనసాగే అవకాశముంది.



క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు



అద్భుతంగా అమరావతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధానమంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



గ్యాలరీల బయట జనం



మహిళల విజయ దరహాసం

దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు

మా గ్రామం వద్ద చెత్త పోయొద్దు

వీఎంఆర్ కాలనీ గిరిజనుల నిరసన



సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి రోడ్డుపై నిరసన తెలుపుతున్న వీఎంఆర్ గిరిజన కాలనీవాసులు

సూళ్లూరుపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని చెత్తను తెచ్చి తమ గ్రామ సమీపంలో పోయొద్దని కొణ్ణంబట్టు సమీపంలో ఉన్న వీఎంఆర్ గిరిజన కాలనీవాసులు స్పష్టం చేశారు. శుక్రవారం చెత్త తరలిస్తున్న మున్సిపల్ ట్రాక్టర్లను అడ్డుకొని సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి రోడ్డుపై నిరసనకు దిగారు. సూళ్లూరుపేట డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి అదుపులోకి రాకపోవడంతో మున్సిపాలిటీ అధికారులు పట్టణంలో చెత్తంతా కొణ్ణంబట్టు సమీపంలోని జగనన్న లే అవుట్ ఎదురుగా ఉన్న భూముల్లో పోస్తున్నారు. శుక్రవారం రెండు ట్రాక్టర్ల చెత్తను తీసుకెళ్లి పోస్తుండగా సమీపంలో ఉన్న వీఎంఆర్ గిరిజన సెంటర్ వాసులు అడ్డుకొని ఇక్కడ చెత్తను పోయద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం రోడ్డుపైకి చేరుకొని నిరసన తెలిపారు. జనావాసాలు ఉన్న చోట చెత్తపోసి డంపింగ్ యార్డులా మార్చవద్దని అన్నారు. అక్కడున్న స్థానికులు కొందరు సర్దిచెప్పి రోడ్డుపై నిరసన చేపట్టవద్దని, మున్సిపల్ అధికారులతో మాట్లాడుకోవాలని సర్దిచెప్పి పంపించేశారు. దీనిపై మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా డంపింగ్ యార్డులో మంటలు అదుపులోకి రాలేదని, అందువల్ల తాత్కాలికంగా చెత్తను జగనన్న లే అవుట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం పోస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆ చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తామని చెప్పారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ చేతివాటం

రూ.1.50లక్షలు స్వాహా

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ చేతివాటం చూపి రూ.1.50లక్షల పెన్షన్ నగదు స్వాహా చేశాడు. దీంతో అతడి కుటుంబ సభ్యుల నుంచి రికవరీ చేసి ఆ నగదును డీఆర్‌డీఏకు పంపారు. ఏప్రిల్ మాసానికి సంబంధించి కేశవరం పంచాయతీ పరిధిలో 410మందికి పెన్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం రూ.19లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. పెన్షన్ల పంపిణీ అనంతరం ఇంటి వద్ద లేనివారు, చనిపోయిన వారికి సంబంధించి సుమారు రూ.1.50లక్షలు మిగిలింది. ఆ సొమ్మును సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఆ నగదును డీఆర్‌డీఏ కార్యాలయానికి చేర్చాల్సి ఉండగా, అలా చేయలేదు. దీనిపై వెల్ఫేర్ అసిస్టెంట్‌ను పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్‌డీ నిలదీసినప్పటికీ సమాధానం దాటవేస్తూ వచ్చాడు. శుక్రవారం టీడీపీ నేత చాపల శ్రీనివాసులుతో పాటు పలువురు నాయకులు వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నిలదీయడంతో ఆ నగదును తానే వాడుకున్నానని చెప్పాడు. దీంతో ఉద్యోగం పోతుందన్న భయంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబసభ్యులు ఆఘమేఘాలపై నగదు సమీకరించి టీడీపీ నాయకుల ద్వారా సచివాలయంలో అప్పగించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. కాగా, మే నెలలో కూడా 37మందికి పెన్షన్ ఇవ్వలేదని సమాచారం.

కిశోరి వికాసంపై అవగాహన కల్పించాలి



సూచనలిస్తున్న ఇన్‌చార్జి సీడీపీవో

గూడూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసంపై బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం - వేసవి సెలవులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింద న్నారు. కిశోర బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యాలు, క్రీడలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలతో వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈనెల 2నుంచి జూన్ 10వ తేదీ వరకు రోజుకు ఒక అంశంపై బాలికలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హైమావతి, చెంచులక్ష్మి, బుజ్జమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అబార్షన్ అయ్యి ఆస్పత్రికి..

వైద్యం అందక గర్భిణి అవస్థలు

స్థానిక మహిళల సపర్యలతో తప్పిన ప్రమాదం

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మూడు నెలల గర్భిణికి అబార్షన్ అవడంతో ప్రభుత్వాస్పత్రికి వెళ్తే వైద్యం అందక ఆ మహిళ పడరాని పాట్లు పడింది. చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో కూడా గైనకాలజిస్టులు లేకపోవడంతో స్థానిక మహిళలే సపర్యలు చేయడంతో కోలుకుంది. కోట మండంలోని చెందోడు పంచాయతీ నీలగిరి సంఘం గిరిజన కాలనీకి చెందిన మహిళ మూడు నెలలు గర్భిణి. శుక్రవారం ఆమెకు ఉనఎరరన ఓవర్ బ్లీడింగ్ కావడంతో కుటుంబ సభ్యులు కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ గైనకాలజిస్ట్ దీర్ఘకాలిక మెడికల్ సెలవులో ఉందని ఇతర వైద్యులు చెప్పారు. దీంతో దిక్కుతోచని ఆ గిరిజన కుటుంబం వాకాడు ప్రభుత్వాస్పత్రికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అక్కడ కూడా గైనకాలజిస్ట్ మెడికల్ లీవ్‌లో ఉందని తెలియడంతో చిట్టేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చూపించుకోవాలనుకున్నారు. అయితే అక్కడా గైనకాలజిస్ట్ లేకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక బాధితురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇంతలో స్థానిక మహిళలు చొరవ తీసుకుని గర్భిణికి అబార్షన్ అయిందని గుర్తించి సపర్యలు చేయడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది.

ఈతకెళ్లి బాలుడి మృతి



అరవింద్ (ఫైల్‌ఫొటో)

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని రాఘవపురం గ్రామానికి చెందిన గోనుపల్లి అరవింద్ (14) ఈత కొట్టేందుకు వెళ్లి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ కుమారుడు అరవింద్ బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఊరి పొలిమేరల్లో ఉన్న బావిలోకి ఈత కొట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అరవింద్‌తో అందరూ ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. 6 గంటల సమయంలో అరవింద్ మళ్లీ ఈత కొట్టేందుకు వెళ్లి బావిలో దిగాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పొలాల్లో ఉన్న బావుల వద్ద గాలించారు. చుట్టుపక్కల గ్రామాల్లోనూ విచారించినా అరవింద్ ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం తెల్లవారుజామున గ్రామ పొలిమేరల్లో ఉన్న బావిలో మృతదేహం తేలియాడుతుండడాన్ని స్థానికులు గుర్తించి బయటకు తీశారు. సరదాగా ఉండే అరవింద్ చనిపోవడంతో తల్లిదండ్రులతో పాటు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

శ్రీకాళహస్తి, మే 2(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలో మద్యం తాగితే చర్యలు తప్పవని 1టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. పట్టణంలోని జీకే రెడ్డి కాలనీలో శుక్రవారం ఖాళీ ప్రదేశంలో మద్యం తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

7న పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

గూడూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 7వ తేదీన చెన్నైకు చెందిన టీవీఎస్ సుందరం క్లైటాన్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవికృష్ణ, సివిల్ హెచ్‌వోడీ వీరనారాయణ తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఇంటర్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9912342017, 9989085540 నంబర్లను సంప్రదించాలన్నారు.

శంకరాచార్యులకు ప్రత్యేక అలంకరణ



వెంకటగిరి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్ణకమ్మవీధిలో వెలసిన శంకరాచార్యుల మఠంలో ఆయన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి మఠం నిర్వాహకులతో పాటు పిల్లలు నృత్యాలు, భజనలు చేశారు. అన్నదానం చేశారు.



నిరుపయోగంగా ఉన్న కాట్రగుంట సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యకేంద్రం భవనాలు

ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు

బాలాయపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి) మండలంలోని కాట్రగుంట పంచాయతీలో పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కేంద్రాల కోసం కాట్రగుంట పంచాయతీలో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. సచివాలయ భవనం కోసం రూ.40 లక్షలు, ఆరోగ్య కేంద్రం రూ.20.80 లక్షలు, రైతు భరోసా కేంద్రం కోసం 23.94 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. 2021లో పనులు ప్రారంభించి 2023లో నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే ఆయా భవనాలకు ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ఆ భవనాలను ప్రారంభించక నిరుపయోగంగా ఉన్నాయి. ఇక పంచాయతీ కార్యాలయ భవనంలో సచివాలయం, ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఒకే భవనంలో ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రం భవనాలకు విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ధర్మరాజస్వామి ఉత్సవాలు



స్వామివారి దర్శనానికి విచ్చేస్తున్న సినీ నటుడు అజయ్ ఘోష్ - బియ్యం బస్తాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ సతీమణి కోమలి, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ నానాజీ తదితరులు

తడ, మే 2(ఆంధ్రజ్యోతి) తడ మండలం వాటంబేడు కుప్పంలోని పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్నాహ్నం మహాభారత కావ్యం నాటక ప్రదర్శన జరిగింది. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. సినీ నటుడు, పుష్ప సినీ ఫేమ్ అజయ్ ఘోష్ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నై యుగంధర్ విశ్వరాగం ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో పాటకచ్చేరి నిర్వహించారు. సినీ నటుడు అజయ్ ఘోష్ మాటల గారడితో జనాలను ఉర్రూతలూగించారు. టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ 400 బస్తాల బియ్యాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఆ బియ్యం బస్తాలను గంగాప్రసాద్ సతీమణి కోమలి, పెంచలకోన ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ గ్రామస్తులకు పంచిపెట్టారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారిని పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, బొమ్మన్ పళణి, మాధవనాయుడు, శ్రీధర్, జయరామయ్య, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు, రైతులు

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకుంటే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు అన్నారు. మండల పరిధిలోని గూడలి పంచాయతీ చంద్రశేఖరపురంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు, రైతుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలు, నవధాన్యాల సాగువల్ల కలిగే ఉపయోగాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి రైతూ కనీసం అర ఎకరంలోనైనా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ శ్రీకాంత్, మోడల్ మేకర్ శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జ్ పద్మ, రాజ్యాలక్ష్మి, వీఏఏ మునెమ్మ, భానుకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కౌన్సెలర్ నారాయణ

వెంకటగిరి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని 4వ వార్డు కౌన్సెలర్ ఎంవీ నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక కుమ్మరిమిట్ట అంగన్‌వాడీ కేంద్రం స్కూల్‌లో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో బాల్య వివాహాల దురాచారం ఎక్కువగా ఉందన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్ల వయస్సు నిండిన తరువాతనే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో శ్రీనివాసులు, మహిళా పోలీస్ వరలక్ష్మి, మలీశ్వరి, లక్ష్మీకాంతమ్మ, బీనా తదితరులు పాల్గొన్నారు.

కాళంగి నదిలో స్నానానికి వెళ్లి సేలంవాసి మృతి

సూళ్లూరుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలోని కాళంగి నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు.... తమిళనాడు సేలం ప్రాంతానికి చెందిన చిన్నుస్వామి(50) భార్య హంసవేణితో కలిసి కొన్నాళ్లుగా సూళ్లూరుపేటలోనే చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కాళంగి నదిలో స్నానాకి దిగి నీట మునిగిపోయాడు. సమీపంలో ఉన్న గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పెళ్లకూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని టీడీపీ కార్యకర్తలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య సూచించారు. శుక్రవారం కొత్తూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు సిద్దులయ్య నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

తిరుచానూరు, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జస్టిస్ ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

కాలువ భూమిలో ఆక్రమణల తొలగింపు

తిరుపతి రూరల్, మే2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె సర్వే నంబరు 195/1లోని కాలువ పోరంబోకు స్థలాన్ని కలిపేసుకుని వైసీపీ నేత ఏర్పాటు చేసిన దారిని శుక్రవారం రెవెన్యూ అధికారులు ఎక్సకవేటర్ సాయంతో తొలగించారు. కాలువ గట్టుపై గ్రావెల్ పరచి ఏర్పాటు చేసిన దారిని చదును చేశారు. ఆర్ఐ రఘువర్మ, వీఆర్వో మురళి, వీఆర్ఏ పాల్గొన్నారు.

ఆదర్శ దంపతులు సీతారాములు

వివాహం దివ్యత్వ సాధనం పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి, రఘురాం, మేడసాని మోహన్, దక్షిణామూర్తిశర్మ, పీవీ రెడ్డి, ఆముదాల మురళి, గంగవరం శ్రీదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో ఆదర్శ దంపతులుగా సీతారాములు నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త గంగవరం శ్రీదేవి సంపాదకత్వం వహించిన 'వివాహం దివ్యత్వ సాధనం' పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. సంస్కృత యూనివర్సిటీ - శ్రీరామకృష్ణ సేవా సమాజం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని సంస్కృత వర్సిటీలోని చెలికాని అన్నారావు హాల్లో నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సీతారాముల దాంపత్యాన్ని ఉత్తరామ చరితంలో భవభూతి కొనియాడారని తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రత్యేకాధికారి శ్రీరామ్ రఘురాం మాట్లాడుతూ నేటి సామాజిక పరిస్థితుల్లో దాంపత్య జీవితానికి ఆదర్శ మార్గాన్ని ఈ పుస్తకం నిర్దేశిస్తుందని చెప్పారు. అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మేడసాని మోహన్ మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య పవిత్ర ప్రణయ అనుబంధమే దాంపత్యమని అభిప్రాయపడ్డారు. సంస్కృత వర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, రామకృష్ణ మిషన్ తిరుపతి శాఖ అధ్యక్షులు పీవీ రెడ్డి మాట్లాడుతూ మన దేశంలోని దాంపత్య విధానం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అవధాని ఆముదాల మురళి పుస్తక సమీక్ష చేశారు. పుస్తక సంపాదకులు గంగవరం శ్రీదేవి మాట్లాడుతూ పతనమవుతున్న దాంపత్య జీవిత విలువలను పెంపొందించే లక్ష్యంతో ఈ పుస్తకాన్ని వెలువరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ మోహన మునిసిద్ధారెడ్డి, తెలుగు అధ్యాపకులు నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఆధ్యాత్మిక, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం



వడమాలపేట, మే 2(ఆంధ్రజ్యోతి):స్థానిక భవానీ శంకరాలయంలో మహాశివుడి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు.రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ అభిషేకం నిర్వహించారు. అర్చకుడు శివ, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్రహోమం, శాంతి హోమం చేశారు. మహాశివుడి లింగాన్ని పూలమాలాలతో విశేషంగా అలంకరించి మంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

నేడు శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

పుత్తూరు అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోవిందపాళెం సమీపంలో ఉన్న శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. 30 ప్రముఖ ఐటీ, నాన్ ఐటీ మ్యాన్‌ఫ్యాక్చర్ విభాగాల్లో 1500 ఉద్యోగాల నియామక ప్రక్రియ ఉంటుందన్నారు. ఇంటర్, ఐటీఐ, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చేసిన వారు అర్హులని కళాశాల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్ చెప్పారు.

వేడుకగా సామూహిక యజ్ఞోపవీతధారణ

పుత్తూరు అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఆదిశంకరుడి జయంతిని పురస్కరించుకుని గాయత్రి దేవి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సామూహిక యజ్ఞోపవీతధారణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. గాయత్రి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తిరుపతి బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుడు వేదం హరిప్రసాద్ మాట్లాడుతూ... గాయత్రి మంత్ర జపం బుద్ధి, చైతన్యం, తేజస్సు, స్వచ్ఛతను ప్రేరేపిస్తుందన్నారు. గాయత్రి భవన్ నిర్వాహకుడు ఆలూరు రామకృష్ణ మాట్లాడుతూ... యజ్ఞోపవీతధారణ చేసుకున్న ప్రతి ఒక్కరూ నిత్యం త్రికాల సంధ్యావందనం చేయాలన్నారు. బాలాజీ, రమేష్‌బాబు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాలి వాహనంపై సదాశివుడి పురవిహారం



పుత్తూరు టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న కామాక్షిదేవి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్లు యాలి వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అంతకు ముందు ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 7.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అమ్మవారి సమేత సదాశివుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి యాలి వాహనంపై అధిష్టింపజేసి ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలను సమర్పించారు.

అమరా హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం



రేణిగుంట, మే 2, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2వ రోజు అమరా హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం అమరా హాస్పిటల్‌లోని బ్లడ్ సెంటర్‌లో ఇండో ఎంఐఎం కంపెనీ సహకారంతో 50మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇండో ఎంఐఎం ఇన్‌చార్జి దాసరి కిరణ్‌కుమార్‌ను అమరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆస్పత్రి నిర్వాహకుడు శ్రీధర్ అభినందించారు.

వైభవంగా భావనారుషి కల్యాణోత్సవం

నారాయణవనం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగలం ఉత్తరంలో కొలువై ఉన్న భద్రావతి సమేత భావనారుషిస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో మూలవర్లకు నిత్య పూజా కైంకర్యాలు, అభిషేకాలు చేపట్టారు. రాత్రి 10 గంటలకు భద్రావతి సమేత భావనారుషి స్వామికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, మే 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన కొండయ్య (65) వ్యవసాయ కూలి. శుక్రవారం సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై శ్రీకాళహస్తికి బయలుదేరాడు. అమ్మపాళెం సమీపంలో గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో మరో ద్విచక్రవాహనంపై ఉన్న కొండయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి కొండయ్యను చికిత్స నిమిత్తం తిరుపతి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మద్యం సీసాల స్వాధీనం

వరదయ్యపాళెం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కువ్వాకొల్లి పంచాయతీ సీసీఎల్ పరిశ్రమ సమీపంలో బెల్టుషాపుపై పోలీసులు దాడి చేసి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు... శుక్రవారం సాయంత్రం సీసీఎల్ పరిశ్రమ వద్ద బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్టుషాప్ నిర్వహిస్తున్న శీనుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మామిడి రైతులకు పరిహారం చెల్లిస్తాం

రేణిగుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాముండూరులో ఏనుగుల మంద ధ్వంసం చేసిన మామిడి చెట్లకు యజమానులకు పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని సబ్ డీఎఫ్వో నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం మాముండూరులో ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి చెట్లను, సమీపంలోని పూడిపోయిన కందకాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. పరిహారంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు.

నరికిన చెట్లకు పరిహారం

రేణిగుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): అనుమతులున్నాయంటూ విద్యుత్ శాఖ అధికారులు కూలీలతో చెట్లు నరికి వేశారని మామండూరు డీఆర్వో గౌస్ తెలిపారు. గత నెల మామండూరు అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన చెట్లు నరుకుతుండగా అడ్డుకున్నామని, అయితే అటవీశాఖ అనుమతులున్నాయని విద్యుత్ సిబ్బంది చెప్పడంతో వెళ్లిపోయామన్నారు. అయితే చెట్ల నరికివేతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. విచారణలో అనుమతి ఇవ్వలేదని తేలిందన్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించనుందని తెలిపారు.

కిశోరి వికాసం వేసవి శిబిరం

శ్రీకాళహస్తి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు కిశోరి వికాసం వేసవి శిబిరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయసు బాలికలు రక్తహీనత తలెత్తకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మహిళా పోలీసు రేణుక మాట్లాడుతూ ... గ్రామంలో బాలికలు ఒకరికొకరు పరస్పర పరిచయాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిత, అంగన్‌వాడీ టీచర్లు బుజ్జమ్మ, కుమారి పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీకే పురం, వెంగళత్తూరు, ఎస్ఎస్‌బీ పేట సచివాలయాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ ప్రారంభమైంది. బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు, బాలికల హక్కులు, రక్తహీనతపై ఈవోపీఆర్‌డీ శ్రీదేవి అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో కిశోర వికాసంపై ఏపీఎం చంద్రకళ వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మారమ్మ, వెలుగు సీసీలు, సంఘమిత్రలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



బుచ్చినాయుడుకండ్రిగ, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల రైతులందరు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని ఏవో భారతి తెలిపారు. మండలంలోని గాజుల పెళ్లూరులో శుక్రవారం భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పొలంలో మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపుతామన్నారు. ఫలితాల ఆధారంగా రైతులు పంటలను వేయాలన్నారు. పొలాల్లో పచ్చి రొట్ట, జీలగల విత్తనాలు తప్పనిసరిగా వేయాలన్నారు.

సింహవాహనంపై అగస్త్యేశ్వరుడి విహారం



నారాయణవనం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్లను సింహవాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర్‌ప్రాకారంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజలనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామిఅమ్మవార్లను సింహ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యులు జయంతి



శ్రీకాళహస్తి, మే 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రాంగణంలోని కళారాధన వేదికపై శుక్రవారం జగద్గురువు ఆదిశంకరాచార్యులు జయంతిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. కళారాధన వేదికపై ఆదిశంకరాచార్యులు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. హిందు ధర్మ పరిరక్షణకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, వేదపండితులు శివప్రసాద్ శర్మ, శ్రీనివాసులు శర్మ, అర్చకుడు అర్ధగిరిస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాత్రి స్వామివారి చిత్రపటాన్ని పట్టణ నాలుగు మాడవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు.

పైపులైను లీకేజీని అరికట్టండి



బుచ్చినాయుడుకండ్రిగ, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న తాగునీటి పైపులైను లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ పైపులైను కోసం తీసిన గుంత దగ్గర పైపులైను ఉండటంతో మరమ్మతులకు గురైంది. దీంతో నీరు వదిలినప్పుడు ప్రధాన రహదారిపై పారుతోంది. పది రోజులు నుంచి లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు వాపోయారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై పునర్విచారణ

వరదయ్యపాళెం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో జరిగిన అవకతవకలు, నిధుల గోల్‌మాల్‌పై శుక్రవారం తిరుపతి డీఎల్పీవో సురేష్‌నాయుడు పునర్విచారణ చేపట్టారు. ఇందిరానగర్ పంచాయతీలో 2016-23 మధ్య జరిగిన నిధుల అవకతవకలపై సామాజిక కార్యకర్త ఆశ సమాచార హక్కు చట్టం ద్వారా రూ.70లక్షలు గోల్‌మాల్ జరిగిందని, ఆధారాలు సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ కమిటీలు పలుమార్లు తనిఖీ చేసి రూ.21లక్షలు అవకతవకలు జరిగాయంటూ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుత సర్పంచ్ సల్లా వీరభద్రం చెక్ పవర్‌ను రద్దు చేయడమేకాకుండా, నాటి పంచాయతీ అధికారులను సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే దీనిపై మరోమారు ఆశా విచారణ పారదర్శకంగా జరగలేదని రూ.70లక్షలకు గాను రూ.21లక్షలు మాత్రమే అవకతవకలు జరిగినట్లు తేల్చడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం డీఎల్పీవో స్థానిక సచివాలయంలో గ్రామసభ చేపట్టి విచారణ చేశారు. స్థానిక సచివాలయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, ఫిర్యాదుదారు సమక్షంలో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ... తాము ఫిర్యాదు చేసిన అంశాలలో సమగ్రంగా సక్రమంగా విచారణ జరగలేదన్నారు. ఒకే వరస సంఖ్యలో వివిధ దఫాలుగా బిల్లులు సృష్టించి నిధులు స్వాహా చేశారని, సంతకాలు ఫోర్జరీ చేశారని చెప్పారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులపై డీఎల్పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న డీఎల్పీవో

హక్కులపై అవగాహన



శ్రీకాళహస్తి, మే 2(ఆంధ్రజ్యోతి): న్యాయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నగరి వీధిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే చట్టాల గురించి వివరించారు. కార్మికులకు వారి హక్కుల గురించి తెలిపారు. ప్రతి కార్మికుడు శ్రమ్‌కార్డులు కలిగి ఉండాలని తెలిపారు. దీని వలన కలిగే ఉపయోగాలను వివరించారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, పారా లీగల్ వలంటీర్లు ఉదయ్ భాస్కర్, బాబా ఫరీద్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వరదయ్యపాళెం, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల కలల రాజధాని పునఃప్రారంభం కావడం ఆనందంగా ఉందని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో అమరావతిని పట్టించుకోలేదన్నారు. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత మళ్లీ అమరావతికి రూపు వచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆంధ్రుల కలల రాజధాని పునఃప్రారంభం జరగడం ఎంతో సంతోషకరమన్నారు. అన్ని ప్రాంతాలు, వర్గాలు, మతాలు, కులాలకు సంబంధించిన ప్రజారాజధానిగా ఘనత సాధిస్తుందన్నారు. అమరావతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్ది ఇక్కడ కనీసం 5లక్షల మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి వాటిని మూడేళ్లల్లో సాక్షాత్కారం చేయనున్నట్లు చంద్రబాబు ప్రకటించడం శుభ పరిణామమన్నారు. వన్నియకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, భాస్కర్, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జియో టెక్నీషియన్ మృతి



హిమగిరి మృతదేహం

రేణిగుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో జియో టెక్నీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. అర్బన్ సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... జియో స్థానిక మేనేజర్ సూచన మేరకు రామకృష్ణాపురానికి చెందిన టెక్నీషియన్ హిమగిరి (25) గురువారం అర్ధరాత్రి జియో నెట్ టవర్ వద్ద చేరుకున్నాడు. టవర్‌లోని పరికరాలకు విద్యుత్ సరఫరా కావడం లేదని గుర్తించాడు. సరఫరాను పునరుద్ధరించేందుకు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభానికి ఉన్న స్టార్టర్‌ను సరిచేసి పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఉదయం జియో టెక్నీషియన్లు టవర్ వద్దకు వచ్చి చూడగా హిమగిరి మృతి చెంది పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే మేనేజర్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వైద్యాధికారిగా బాధ్యతల స్వీకరణ



డాక్టర్ ధనుష్

పిచ్చాటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా ధనుష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హమీద్ రెండు నెలల క్రితం బదిలీపై తిరుపతి రుయాకి వెళ్లారు. దీంతో ఏర్పడిన ఖాళీని పల్నాడు జిల్లాలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ధనుష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద రోగులకు వైద్యసేవలు అందించడమే ప్రథమ కర్తవ్యంగా ముందుకెళ్తానన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

శ్రీకాళహస్తి, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని పెండ్లి మండపం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. అదే విధంగా వాహనానికి సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

రామాపురంలో పోలీసు పల్లె నిద్ర



శ్రీకాళహస్తి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం ఎస్టీకాలనీలో రూరల్ పోలీసులు పల్లె నిద్ర చేశారు. సీఐ రవినాయక్ కాలనీలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది పిల్లలు పాఠశాలకు వెళ్లడం మానేసి కూలీ పనులకు వెళుతున్నట్లు ఆయన దృష్టి కొచ్చింది. తమ పిల్లలను హాస్టళ్లలో చేర్చే విధంగా చూడాలని తల్లిదండ్రులు కోరారు. అనంతరం చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు బాలమిత్ర కథల పుస్తకాలు, బాలల నీతి కథలు, జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. కానిస్టేబుళ్లు భరత్, నాగరాజు, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ ఈవో ఆకస్మిక తనిఖీ



శ్రీకాళహస్తి, మే, 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అన్నదాన కేంద్రాన్ని ఈవో బాపిరెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేశారు. అనంతరం అన్నదాన కేంద్రంలో అల్పాహారం రుచి చూశారు. ముక్కంటి ఆలయ భక్తులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఉద్యోగులను ఆదేశించారు.

ఆగమోక్తంగా శుక్రవారం ఉత్సవం



శ్రీకాళహస్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు.